సాక్షి
ఖమ్మం
శనివారం । 7 । అక్టోబర్ । 2023



బడుగుల జీవితాల్లో వెలుగులు

బడుగు, బలహీన వర్గాల ప్రజల జీవితాల్లో వెలుగు నింపేందుకు రాష్ట్రప్రభుత్వం కృషి చేస్తోందని మంత్రి పువ్వాడ తెలిపారు. 8లో



హక్కులను కాలరాస్తున్నారు..

కార్మికుల హక్కులను పాలకులు కాలరాస్తున్నారని సీఐటీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి భాస్కర్ ఆరోపించారు. 8లో

గరిష్టం / కనిష్టం
35° / 21°

వాతావరణం

జిల్లాలో శనివారం కూడా ఉష్ణోగ్రత ప్రభావం ఉంటుంది. ఉదయం నుంచే ఎండ మొదలై మధ్యాహ్నం తర్వాత పెరుగుతుంది.

న్యూస్‌రీల్

దసరాకు 695 ప్రత్యేక బస్సులు

ఖమ్మం మామిళ్లగూడెం: దసరా పండుగ సందర్భంగా స్వస్థలాలకు వెళ్లే ప్రయాణికుల కోసం ఆర్టీసీ ఆర్టీసీ ప్రత్యేక బస్సులు నడపనుంది. ఈనెల 13నుండి 24వ తేదీ వరకు ఖమ్మం రీజియన్‌లో 695 ప్రత్యేక బస్సులు నడపాలని అధికారులు నిర్ణయించారు. గత ఏడాది 655 బస్సులు మాత్రమే నడపగా ఈసారి పెంచడమేకాక రద్దీకి అనుగుణంగా మరిన్ని సర్వీసులు నడిపిస్తామని అధికారులు తెలిపారు. కాగా, ఈనెల 13వ తేదీన 45బస్సులు, 14న 35బస్సులు, 15న 35, 16న 50, 17న 60, 18న 60, 19న 60, 20న 75, 21న 75, 22న 75, 23న 75, 24వ తేదీన 50 బస్సులు నడిపేలా ప్రణాళిక సిద్ధం చేసినట్లు పేర్కొన్నారు. ఈ విషయమై రీజియన్‌లోని ఆరు డిపోల అధికారులతో సమావేశాలు నిర్వహించిన అధికారులు ప్రత్యేక బస్సుల ఏర్పాటుపై సూచనలు చేశారు.

మధిర ఫైర్ ఆఫీసర్‌కు ప్రెసిడెంట్ మెడల్



పతకం అందజేస్తున్న హోం మంత్రి

మధిర: మధిర ఫైర్ ఆఫీసర్‌గా విధులు నిర్వర్తిస్తున్న యర్రగుంట వెంకటేశ్వరరావు శుక్రవారం ప్రెసిడెంట్ మెడల్ అవార్డు అందుకున్నారు. స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా ఆయనను అవార్డుకు ఎంపిక చేయగా శుక్రవారం హైదరాబాద్‌లో జరిగిన సమావేశంలో రాష్ట్ర హోం మంత్రి మహమూద్ అలీ, ఫైర్ సర్వీస్ డైరెక్టర్ జనరల్ యర్రా నాగిరెడ్డి చేతుల మీదుగా స్వీకరించారు. మధిర నియోజకవర్గ పరిధిలోని సుమారు 100 అగ్ని ప్రమాద ఘటనల సమయాన తక్షణమే స్పందించి రూ.కోట్ల విలువైన సంపదను కాపాడడంతో వెంకటేశ్వరరావుకు అవార్డు అందజేయగా, ఉద్యోగులు ఆయనను అభినందించారు.

ఉత్తీర్ణత పెరిగేలా బోధించండి



విద్యార్థులతో మాట్లాడుతున్న డీఐఈఓ రవిబాబు

ఎర్రుపాలెం: ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో ఉత్తీర్ణత శాతం పెరిగేలా విద్యార్థులకు మెరుగైన బోధన అందించాలని జిల్లా ఇంటర్మీడియట్ విద్యాశాఖాధికారి కె.రవిబాబు సూచించారు. ఎర్రుపాలెం మండలం మండలం బనిగండ్లపాడులోని ప్రభుత్వ జూనియర్ కళాశాలను శుక్రవారం ఆయన తనిఖీ చేశారు. ఈసందర్భంగా రికార్డులు పరిశీలించాక అధ్యాపకులకు సూచనలుచేశారు. అలాగే, విద్యార్థులతో మాట్లాడి వారి సామర్థ్యాలను పరీక్షించారు. ప్రిన్సిపాల్ ఎస్.రమణారెడ్డి, అధ్యాపకులు పాల్గొన్నారు.

ఇంటర్నెట్ సమస్యతో ఓపీ సేవలకు అంతరాయం



చిట్టీపై రాసి ఇస్తున్న సిబ్బంది

ఖమ్మం వైద్యవిభాగం: ఖమ్మం ప్రభుత్వ ఆస్పత్రిలో శుక్రవారం ఇంటర్నెట్ సమస్య ఎదురు కావడంతో ఓపీ సేవలకు అంతరాయం కలిగింది. ఇటీవల జ్వర పీడితులతో పెద్దాస్పత్రికి తాకిడి పెరిగింది. దీంతో ఓపీ వద్ద ఉదయం నుండే చిట్టీ కోసం బారులు తీరుతున్నారు. కాగా, శుక్రవారం ఇంటర్నెట్ మొరాయించడంతో ఓపీ నమోదు చేయటం సాధ్యం కాకపోగా అంతకంతకూ క్యూ పెరిగింది. చివరకు చేసేదేం లేక సిబ్బంది చిట్టీలు రాసి ఇచ్చారు.

ఎరువుల దుకాణాల్లో డీఏఓ తనిఖీ

తల్లాడ: తల్లాడ మండలం మిట్టపల్లిలోని ఎరువుల దుకాణాలను జిల్లా వ్యవసాయాధికారి ఎం.విజయనిర్మల శుక్రవారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పీఓఎస్ మిషన్ ద్వారానే విక్రయాలు చేపట్టడంతో పాటు స్టాక్ రిజిస్టర్లు పక్కాగా నిర్వహించాలని యజమానులకు ఆదేశించారు. అలాగే, ధరలు పెంచి విక్రయించినట్లు తెలిస్తే చర్యలు తీసుకుంటామని తెలిపారు. అనంతరం తల్లాడ రైతు వేదికలో ఏఈఓలతో సమావేశమైన ఆమె పలు సూచనలు చేశారు. ఏడీఏ నర్సింహారావు, ఏఓ తాజుద్దీన్ పాల్గొన్నారు.

డ్రోన్ షో అదుర్స్!



డ్రోన్ల లైట్లతో ప్రదర్శించిన తెలంగాణ రాష్ట్రపటం

జిల్లా కేంద్రంలోని లకారం ట్యాంక్‌బండ్‌పై 400 డ్రోన్లతో ఇచ్చిన ప్రదర్శన నగరవాసులకు ఆకట్టుకుంది. రాష్ట్ర పర్యాటక శాఖ ఆధ్వర్యాన శుక్రవారం రాత్రి డ్రోన్ షో ఏర్పాటుచేశారు. డ్రోన్ లైట్లతో ఆకాశంలో తెలంగాణ చిత్రపటం, లకారం కేబుల్ బ్రిడ్జి, కేఎంసీ కార్యాలయం, ఖమ్మం ఖిల్లా, ఐటీ హబ్, నేలకొండపల్లి బౌద్ధ స్థూపం, ఖమ్మం కొత్త బస్టాండ్‌తో పాటు అంబేద్కర్, సీఎం కేసీఆర్ ఎన్టీఆర్, మంత్రి పువ్వాడ అజయ్ చిత్రపటాలను ప్రదర్శించగా పెద్దసంఖ్యలో హాజరైన నగరవాసులు ఆసక్తిగా తిలకించారు. – ఖమ్మంమయూరిసెంటర్

- లకారం ట్యాంక్‌బండ్ వద్ద 400 డ్రోన్లతో ప్రదర్శన
- అబ్బురపరిచిన చారిత్రక కట్టడాలు, చిత్రపటాలు
- షోను ప్రారంభించిన మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్

నా కల నెరవేరింది..

హైదరాబాద్‌లో సెక్రటేరియట్ ప్రారంభోత్సవం సందర్భంగా పర్యాటకశాఖ ఆధ్వర్యాన ప్రదర్శించిన డ్రోన్ షోను ఖమ్మంలోనూ ఏర్పాటుచేయాలని భావించగా ఇప్పుడు ఆ కల నెరవేరిందని రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్ తెలిపారు. డ్రోన్ షోను ప్రారంభించిన ఆయన మాట్లాడుతూ ఎన్టీఆర్ పార్కును ప్రజలకు అందుబాటులోకి తీసుకొచ్చిన మంత్రి కేటీఆర్‌కు కృతజ్ఞతలు చెప్పారు. మురికికూపంగా ఉన్న లకారాన్ని అద్భుత పర్యాటక ప్రాంతంగా తీర్చిదిద్దామని వెల్లడించారు. డ్రోన్ షో ఏర్పాటుకు సహకరించిన పర్యాటకశాఖ అధికారులు, కలెక్టర్, కేఎంసీ కమిషనర్‌కు మంత్రి ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో పర్యాటకశాఖ ఎండీ మనోహర్, కలెక్టర్ వీ.పీ.గౌతమ్, సీపీ విష్ణు ఎస్.వారియర్, మేయర్ పునుకొల్లు నీరజ, కేఎంసీ కమిషనర్ ఆదర్శ్ సురభి, సుడా, డీసీసీబీ, మార్కెట్ చైర్మన్లు బచ్చు విజయ్‌కుమార్, కూరాకుల నాగభూషణం, దోరేపల్లి శ్వేత, కార్పొరేటర్ కర్నాటి కృష్ణ, బీఆర్ఎస్ నగర అధ్యక్షుడు పగడాల నాగరాజు తదితరులు పాల్గొన్నారు. తొలుత ఎన్టీఆర్ పార్క్‌లో గాయనీగాయకులు తమ పాటలతో అలరించారు.



మాట్లాడుతున్న మంత్రి అజయ్‌కుమార్, పక్కన సీపీ వారియర్, మేయర్ పునుకొల్లు నీరజ, కేఎంసీ కమిషనర్ ఆదర్శ్‌సురభి, డీసీసీబీ చైర్మన్ నాగభూషణం, జెడ్పీటీసీ ప్రియాంక తదితరులు



డ్రోన్ల లైట్లతో రూపొందించిన చిత్రం



అంబేద్కర్



సీఎం కేసీఆర్



మంత్రి అజయ్‌కుమార్

గుండె బరువెక్కుతోంది..



పెద్దాస్పత్రిలో క్యాథల్యాబ్ సేవలకు అంతరాయం

- కాంట్రాస్ట్ ఇంజక్షన్లు లేక ఇక్కట్లు
- తరచుగా ఇలాగే జరుగుతున్నా పట్టించుకోని వైనం
- శాశ్వత పరిష్కారంపై దృష్టి సారించకపోవడంతో తిప్పలు

ఖమ్మం వైద్యవిభాగం: జిల్లా పెద్దాస్పత్రిలో వైద్యంపై నమ్మకంతో వచ్చే వారికి ఏదో ఒక చోట ఇక్కట్లు ఎదురవుతున్నాయి. గుండె సంబంధిత వ్యాధుల నిర్ధారణ, చికిత్స కోసం ఏర్పాటుచేసిన క్యాథల్యాబ్ సేవలు తరచుగా నిలిచిపోతుండడంతో ఆస్పత్రికి వచ్చే రోగులు ఇబ్బంది పడుతున్నారు. క్యాథల్యాబ్ మిషన్ ద్వారా గుండె పనితీరు తెలుసుకునేందుకు వినియోగించే కాంట్రాస్ట్ ఇంజక్షన్ల కొరతతో ఈ పరిస్థితి ఎదురవుతోంది. యాంజియోగ్రామ్, స్టంట్స్, యాంజియో ప్లాస్టీ తదితర సేవలందించే క్రమంలో కాంట్రాస్ట్ ఇంజక్షన్ల అవసరం కీలకంగా ఉంటుంది. కానీ ఇటీవల ఇంజక్షన్ల కొరతతో సేవలకు అంతరాయం ఏర్పడుతోంది.

రెండేళ్ల క్రితం ఏర్పాటు

ఖమ్మం ప్రభుత్వ ఆస్పత్రిలో రెండేళ్ల క్రితం రూ.7కోట్ల వ్యయంతో క్యాథల్యాబ్ మిషన్‌ను అందుబాటులోకి తీసుకొచ్చారు. అప్పటి నుంచి వేలాది మందికి స్టంట్లు వేయడమే కాక ఇతర చికిత్సలు చేశారు. కానీ పది రోజులుగా సేవలు పూర్తిగా నిలిచిపోయాయి. దీంతో ఇన్ పేషంట్ వార్డులో చేరిన గుండె సంబంధిత వ్యాధి బాధితులు ఆందోళన చెందుతున్నారు. ప్రైవేట్ ఆస్పత్రులకు వెళ్లే స్థోమత లేక క్యాథల్యాబ్ సేవలు ఎప్పుడు మొదలవుతాయోనని ఎదురుచూస్తున్నారు.

తరచూ ఇదే పరిస్థితి


గత కొంత కాలంగా క్యాథల్యాబ్ తరచూ సేవలకు అంతరాయం ఏర్పడుతోంది. ప్రభుత్వపరంగా కాంట్రాస్ట్ ఇంజక్షన్లను సరఫరా చేస్తున్నా.. వీటితో రోగులకు ఇతర సమస్యలు వస్తున్నట్లు వైద్యులు గుర్తించడంతో వాడకాన్ని నిలిపివేశారు. అప్పటి నుంచి ప్రైవేట్ ఏజెన్సీ ద్వారా ఇంజక్షన్లు తెప్పిస్తున్నా, ఇటీవల బకాయిలు పేరుకుపోవటంతో బాధ్యులు సరఫరా నిలిపివేశారు. ఇలా తరచుగా జరుగుతుండడంతో సేవలు నిలిచిపోతుండగా.. యాంజియోగ్రామ్, స్టంట్స్ తదితర సేవలు పొందాల్సిన వివిధ ప్రాంతాల బాధితులు ఇబ్బంది పడుతున్నారు. ఆస్పత్రికి గుండె సంబంధిత వ్యాధులతో బాధపడుతున్న 70 నుండి 100 మంది వరకు రోజూ వస్తున్నారు. వీరిలో ఎక్కువ మంది నిరుపేదలే కావడం, సేవల్లో అంతరాయం ఏర్పడుతుండడంతో ఆరోగ్యంపై ఆందోళన చెందుతున్నారు. ఇకనైనా అధికారులు స్పందించి శాశ్వతంగా కాంట్రాస్ట్ ఇంజక్షన్ల సరఫరా కోసం కాంట్రాక్టర్‌ను నియమించాలని కోరుతున్నారు.

బయటి నుంచి తెప్పిస్తాం..




క్యాథల్యాబ్ సేవలు నిలిచిన మాట వాస్తవమే. కాంట్రాస్ట్ ఇంజక్షన్ల సరఫరాకు శాశ్వత కాంట్రాక్టర్ లేక ఇబ్బంది వస్తోంది. అయినా ఇన్‌పేషంట్లకు సమస్య లేకుండా చూస్తున్నాం. శాశ్వత పరిష్కారంపై దృష్టి సారించి, అప్పటివరకు బయట నుంచి ఇంజక్షన్లు తెప్పిస్తాం.
– బి.శ్రీనివాసరావు, ఆర్ఎంఓ

పనికి వెళ్తేనే జీవనం



నాకు కూలి పనే జీవనాధారం. గుండెలో నొప్పి రావడంతో ఆస్పత్రిలో వారం క్రితం చేరాను. ఏదో ఇంజక్షన్ ఉంటేనే పరీక్ష చేయడం కుదరుతుందని చెప్పారు. బయటకు వెళ్లలేని పరిస్థితి ఉండగా.. ఇక్కడా పరీక్ష చేయడం లేదు. వైద్యులు స్పందించి ఇంజక్షన్లు తెప్పించాలి.
– కె.ఉప్పలయ్య, పాల్వంచ

పది రోజులైంది



పొలం పని చేస్తుండగా గుండె భాగంలో నొప్పి రావడంతో ఖమ్మంలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చేరాను. కానీ డబ్బు చెల్లించలేక తిరిగి ప్రభుత్వ ఆస్పత్రికి వచ్చాం. గుండె సంబంధిత వ్యాధిగా గుర్తించి పరీక్ష చేయాలని చెప్పిన వైద్యులు పది రోజులుగా రేపు, మాపు అంటున్నారు.
– టి.బాబు, బోనకల్ మండలం రావినూతల

దళితబంధు సర్వే మొదలు..

- సత్తుపల్లి నియోజకవర్గం, బోనకల్ మండలంలో ప్రారంభం
- ప్రత్యేకాధికారుల నేతృత్వాన ఇంటింటి సర్వే
- తల్లాడలో పరిశీలించిన కలెక్టర్ గౌతమ్



సత్తుపల్లి టౌన్ : సర్వేను పరిశీలిస్తున్న అదనపు కలెక్టర్ సత్యప్రసాద్

ఖమ్మం సహకారనగర్/తల్లాడ: జిల్లాలోని సత్తుపల్లి నియోజకవర్గం, మధిర నియోజకవర్గంలోని బోనకల్ మండలాల దళిత కుటుంబాలన్నింటికీ ప్రభుత్వం దళితబంధు మంజూరు చేస్తూ ఇటీవల జీఓ జారీ చేయగా సర్వే ప్రారంభించినట్లు కలెక్టర్ వీ.పీ.గౌతమ్ తెలిపారు. ఈ సర్వే శుక్రవారం మొదలుకాగా, తల్లాడ మండలం కొడవటిమెట్టలో కలెక్టర్ గౌతమ్ పరిశీలించారు. గ్రామ దళిత కాలనీలోని పలువురి ఇళ్లకు వెళ్లిన కలెక్టర్ వారి ధృవపత్రాలు, కుటుంబ స్థితిగతులను పరిశీలించి మాట్లాడారు. సత్తుపల్లి నియోజకవర్గంలో 25,143 ఎస్సీ కుటుంబాలు, బోనకల్ మండలంలో 4,922 కుటుంబాలు ఉండగా, వీరికి రూ.10 లక్షల చొప్పున రూ.3,006.50 కోట్లు దళితబంధు ద్వారా అందుతాయని తెలిపారు. గ్రామాల్లో సర్వే కోసం అధికారులను నియమించగా, రెండు రోజుల్లో సర్వే చేసి అర్హులందరికీ పథకం గ్రౌండింగ్ చేయాలని నిర్ణయించినట్లు చెప్పారు. కాగా, ఎలాంటి లోటుపాట్లు ఎదురుకాకుండా సర్వే చేయాలని అధికారులకు కలెక్టర్ సూచించారు.

ఆదివారంలోగా సర్వే పూర్తి

సత్తుపల్లిటౌన్/వేంసూరు/కల్లూరురూరల్: సత్తుపల్లి నియోజకవర్గంలో దళితబంధు లబ్ధిదారుల ఎంపికకు ఆదివారం కల్లా సర్వే పూర్తి చేస్తామని జిల్లా అదనపు కలెక్టర్ సత్యప్రసాద్ వెల్లడించారు. సత్తుపల్లిలోని అంబేద్కర్‌నగర్, అయ్యగారిపేట, గాంధీనగర్‌లో సర్వేను పరిశీలించిన ఆయన వేంసూరు మండల పరిషత్ కార్యాలయంలో ప్రత్యేక అధికారులు, కార్యదర్శులతో సమావేశమై పలు సూచనలు చేశారు. దళితబంధు పథకానికి 18 నుంచి 60 ఏళ్ల వయస్సు కలిగి, ఆధార్‌కార్డు, తెల్ల రేషన్‌కార్డు, కుల ధ్రువీకరణ పత్రం ఉన్న వారు అర్హులని తెలిపారు. ఈమేరకు అధికారులు ప్రతీ ఇంటికి వెళ్లి సర్వే చేయాలని సూచించారు. సత్తుపల్లి మున్సిపల్ చైర్మన్ కూసంపూడి మహేష్, కమిషనర్ కె.సుజాత, మేకల నర్సింహారావు, వేంసూరు ఎంపీడీఓ రమేష్, ఎంపీఓ రంజిత్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు. ఇక కల్లూరు మండలంలో ఆర్డీఓ అశోక్ చక్రవర్తి ఆధ్వర్యాన సర్వే ప్రారంభించారు.

బోనకల్ మండలంలో..

బోనకల్: దళితబంధు పైలట్ ప్రాజెక్టుగా బోనకల్ మండలాన్ని ఎంపిక చేసిన నేపథ్యాన మండలాన్ని ఐదు జోన్లుగా విభజించి సర్వే ప్రారంభించారు. ఈ సందర్భంగా సర్వేను జెడ్పీ సీఈఓ వీ.వీ.అప్పారావు పరిశీలించి ఉద్యోగులకు సూచనలు చేశారు. తప్పకుండా ప్రతీ ఇంటికి వెళ్లి ధృవపత్రాలు, కుటుంబం వివరాలు సేకరించాలని సూచించారు. అలాగే, ప్రతిరోజు సర్వే వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని తెలిపారు. బీసీ సంక్షేమ శాఖ జిల్లా అధికారి జ్యోతి, డీడబ్ల్యూఓ సుమతో పాటు వివిధ శాఖల అధికారులు టి.శ్రీనివాసరావు, పుష్పలత, జయశ్రీ, అశోక్, శాస్త్రి తదితరులు పాల్గొన్నారు.

మధిరకు సబ్ కోర్టు మంజూరు

మధిర: దశాబ్దాలుగా ప్రజలు, కక్షిదారులు, న్యాయవాదులు విన్నవిస్తున్న నేపథ్యాన మధిరకు సీనియర్ సివిల్ జడ్జి కోర్టు(సబ్ కోర్టు)ను మంజూరు చేశారు. ఇన్నాళ్లు సీనియర్ సివిల్ జడ్జి కోర్టు లేకపోవడంతో పలు కేసుల విషయమై కక్షిదారులు, న్యాయవాదులు సత్తుపల్లికి వెళ్లాల్సి వచ్చేది. ఈమేరకు ప్రజల సహకారంతో న్యాయవాదులు సుమారు నాలుగు దశాబ్దాలుగా విన్నవిస్తుండగా, మధిరలో సీనియర్ సివిల్ జడ్జి, అసిస్టెంట్ సెషన్స్ జడ్జి కోర్టును మంజూరు చేస్తూ తెలంగాణ ప్రభుత్వం న్యాయశాఖ ద్వారా శుక్రవారం ఉత్తర్వులు జారీ చేసింది. కాగా, కోర్టు మంజూరుకు సహకరించిన రాష్ట్ర ప్రభుత్వం, న్యాయమూర్తులు, ప్రజాప్రతినిధులకు మధిర బార్ అసోసియేషన్ బాధ్యులు కృతజ్ఞతలు తెలిపారు.

ఖమ్మం మార్కెట్‌కు కొత్త పత్తి

క్వింటాకు రూ.6,811 ధర

ఖమ్మంవ్యవసాయం: పత్తి సీజన్ ప్రారంభమైంది. ఈఏడాది సాగు చేసిన పత్తి పంట తొలితీత 32బస్తాలను శుక్రవారం ఖమ్మం వ్యవసాయ మార్కెట్‌కు తీసుకొచ్చారు. ఈసందర్భంగా మార్కెట్ చైర్‌పర్సన్ దోరేపల్లి శ్వేత, ఉన్నత శ్రేణి కార్యదర్శి రుద్రాక్షి మల్లేశం, వ్యాపారులు పూజలు చేసి కొనుగోళ్లను ప్రారంభించారు. కొణిజర్ల మండలం సీతారాంపురానికి చెందిన రైతు నాగరాజు తీసుకొచ్చిన 12 బస్తాల పత్తిని గరిష్టంగా రూ.6,811 ధరతో కొనుగోలు చేశారు. కాగా, ఈ ఏడాది పత్తి తేమశాతం ఆధారంగా(8 శాతం) రూ.7,020 గరిష్ట ధరగా కేంద్రప్రభుత్వం నిర్ణయించింది. అయితే, ప్రస్తుతం విక్రయానికి వచ్చే పత్తిలో అధిక తేమ ఉన్నందున ప్రభుత్వం నిర్ణయించిన ధర కంటే తక్కువగా పలికింది. అంతేకాక తెలుగు రాష్ట్రాల్లో పత్తికి ఇప్పుడు డిమాండ్ లేకపోవడంతో రాజస్తాన్, గుజరాత్ తదితర రాష్ట్రాలకు తరలిస్తున్నట్లు వ్యాపారులు చెబుతున్నారు. ఈ కార్యక్రమంలో ఖమ్మం చాంబర్ ఆఫ్ కామర్స్ బాధ్యులు మన్నెం కృష్ణ, దిరిశాల చిన వెంకటేశ్వర్లు, వ్యాపారి చిలకల ఆదినారాయణ తదితరులు పాల్గొన్నారు.



పత్తి కొనుగోళ్లను ప్రారంభిస్తున్న చైర్‌పర్సన్ శ్వేత

విద్యావ్యవస్థ బలోపేతంపై ప్రత్యేక దృష్టి

- అందుకే పాఠశాలల్లో సీఎం అల్పాహార పథకం
- మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్

ఖమ్మంఅర్బన్: రాష్ట్రంలో విద్యావ్యవస్థను బలోపేతం చేసే దిశగా ప్రభుత్వం అన్ని చర్యలు తీసుకుంటోందని రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్ పేర్కొన్నారు. ఇందులో భాగంగానే విద్యార్థులకు అల్పాహారం అందజేయాలని సీఎం కేసీఆర్ నిర్ణయించారని తెలిపారు. జిల్లా కేంద్రంలోని రోటరీనగర్ ప్రభుత్వ పాఠశాలలో శుక్రవారం ఉదయం ఆయన కలెక్టర్ వీ.పీ.గౌతమ్, కేఎంసీ మేయర్ పి.నీరజ, కమిషనర్ ఆదర్శ్ సురభితో కలిసి అల్పాహార పథకాన్ని ప్రారంభించి విద్యార్థులతోపాటే టిఫిన్ చేశారు. అనంతరం మంత్రి మాట్లాడుతూ పాఠశాలల్లో ఇప్పటికే రాగిజావ, మధ్యాహ్న భోజనం అందిస్తుండగా విద్యార్థుల ఆరోగ్య పరిరక్షణ కోసం టిఫిన్ కూడా ఇవ్వాలని నిర్ణయించినట్లు తెలిపారు. కలెక్టర్ గౌతమ్ మాట్లాడుతూ నియోజకవర్గానికి ఒక పాఠశాల చొప్పున ముఖ్యమంత్రి అల్పాహార పథకాన్ని ప్రారంభించగా, దసరా సెలవుల తర్వాత అన్ని పాఠశాలల్లో మొదలుపెడతామని చెప్పారు. ఇంకా ఈ కార్యక్రమంలో సుడా చైర్మన్ విజయ్‌కుమార్, కార్పొరేటర్ జాన్‌బీ, డీఈఓ ఏ.సోమశేఖరశర్మ, డీడబ్ల్యూఓ సుమ, ఎంఈఓ ఎం.శ్రీనివాస్, ప్రధానోపాధ్యాయుడు మోత్కూరి మధు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



రోటరీనగర్ పాఠశాలలో విద్యార్థులతో కలిసి టిఫిన్ చేస్తున్న మంత్రి పువ్వాడ అజయ్, కలెక్టర్ గౌతమ్, మేయర్ నీరజ, కమిషనర్ ఆదర్శ్

పౌష్టికాహారం లోపాన్ని అరికట్టడానికే..

ఖమ్మంరూరల్: పిల్లల్లో పౌష్టికాహార లోపాన్ని అరికట్టేందుకు ప్రభుత్వం ముఖ్యమంత్రి అల్పాహార పథకాన్ని ప్రవేశపెట్టిందని కలెక్టర్ వీ.పీ.గౌతమ్ తెలిపారు. ఖమ్మం రూరల్ మండలం జలగంనగర్ ఉన్నత పాఠశాలలో ఎమ్మెల్యే కందాళ ఉపేందర్‌రెడ్డితో కలిసి పథకాన్ని కలెక్టర్ ప్రారంభించి మాట్లాడారు. నాణ్యమైన అల్పాహారంతో విద్యార్థులు ఆరోగ్యంగా ఎదగడమే కాక శ్రద్ధగా చదువుకోగలుగుతారని తెలిపారు. డీఈఓ ఏ.సోమశేఖరశర్మ, ఈఈ నాగేశ్వ, తహసీల్దార్ బీ.వీ.రామకృష్ణ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



ఖమ్మం రూరల్ మండలం జలగం నగర్ పాఠశాలలో పిల్లలతో కలిసి టిఫిన్ చేస్తున్న కలెక్టర్ గౌతమ్, ఎమ్మెల్యే కందాళ ఉపేందర్‌రెడ్డి

క్లుప్తంగా

నేడు జేసీ మాల్ ప్రారంభం

ఖమ్మం గాంధీచౌక్: ఖమ్మంలో జేసీ మాల్‌ను శనివారం ప్రారంభించనున్నారు. జిల్లా కేంద్రంలోని టూ టౌన్ పోలీస్‌స్టేషన్ సమీపాన అధునాతన హంగులతో నిర్మించిన జేసీ మాల్‌ను సినీ హీరోయిన్ రీతూవర్మ ప్రారంభిస్తారని మేనేజింగ్ డైరెక్టర్లు కృష్ణారావు, వెంకటరెడ్డి తెలిపారు. అధునాతన డిజైన్లలో అన్ని వయస్సుల వారికి కావాల్సిన వస్త్రాలు అందుబాటులో ఉంటాయని వెల్లడించారు.

నేడు, రేపు ఎంపీ పర్యటన

ఖమ్మంమయూరిసెంటర్: బీఆర్‌ఎస్ లోక్‌సభ పక్ష నేత, ఖమ్మం ఎంపీ నామ నాగేశ్వరరావు శని, ఆదివారాల్లో ఉమ్మడి ఖమ్మం జిల్లాలో పర్యటిస్తారు. జూలూరుపాడు మండల ముఖ్య కార్యకర్తల సమావేశంలో శనివారం పాల్గొననున్న ఆయన కొత్తగూడెం, పాల్వంచ, ఖమ్మంలోజరిగే కార్యక్రమాలకు కూడా హాజరవుతారు. ఇక ఆదివారం ఖమ్మం, కొణిజర్ల, మధిర, చింతకాని మండలాల్లో ఎంపీ పర్యటిస్తారని ఆయన క్యాంపు కార్యాలయ వర్గాలు ఓ ప్రకటనలో వెల్లడించాయి.

జిల్లాస్థాయి పోటీల్లో గురుకుల విద్యార్థుల ప్రతిభ



గెలుచుకున్న బహుమతులతో విద్యార్థులు

కొణిజర్ల: మహాత్మా జ్యోతిబా పూలే గురుకుల పాఠశాలల జిల్లాస్థాయి క్రీడాపోటీల్లో తనికెళ్లలోని మహాత్మా జ్యోతిబాపూలే బాలుర గురుకుల పాఠశాల విద్యార్థులు ప్రతిభ కనబర్చారు. అండర్–17 విభాగంలో ఖో–ఖోలో ప్రథమ, టెన్నీకాయిట్, చెస్‌లో ద్వితీయ బహుమతులు సాధించగా, అథ్లెటిక్స్‌లో అండర్–17లో ఓవరాల్ చాంపియన్ షిప్, అండర్–14 అన్ని క్రీడాంశాల్లో ప్రథమ స్థానంలో నిలిచి చాంపియన్‌షిప్ కైవసం చేసుకున్నారని ప్రిన్సిపాల్ మల్లయ్య తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థులను శుక్రవారం ఖమ్మం జిల్లా కోఆర్డినేటర్ అంజలి, డీఐఈఓ రవికుమార్, భద్రాద్రి కొత్తగూడెం జిల్లా డీసీఓ బ్యూలారాణి అభినందించారు.

రేపు జిల్లాస్థాయి చెస్ ఎంపిక పోటీలు

ఖమ్మంస్పోర్ట్స్: ఈ నెల 8వ తేదీన జిల్లాస్థాయి అండర్–9, 15 చెస్ ఎంపిక పోటీలు నిర్వహించనున్నారు. ఖమ్మంలోని త్రివేణి పాఠశాలలో ఈ పోటీలు జరుగుతాయని ఉమ్మడి జిల్లాస్థాయి చెస్ అసోసియేషన్ కార్యదర్శి జి.జోత్స్న, రఫీ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ ఎంపిక పోటీల్లో భద్రాద్రి కొత్తగూడెం, ఖమ్మం జిల్లాకు చెందిన క్రీడాకారులు పాల్గొనవచ్చని, ఇక్కడ ప్రతిభ కనబర్చిన వారిని రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక చేస్తామని త్రివేణి పాఠశాల డైరెక్టర్లు గొల్లపూడి వీరేంద్రచౌదరి, ప్రిన్సిపాల్ రాజేంద్రప్రసాద్ తెలిపారు.

నిర్మలా హైస్కూల్‌లో ఎంఈఓ విచారణ

కారేపల్లి: అల్లరి చేస్తున్నాడని, హోంవర్క్ సరిగ్గా చేయడం లేదని కారేపల్లిలోని నిర్మలా హైస్కూల్‌లో ఆరో తరగతి విద్యార్థి జయరామ్‌ను ఓ ఉపాధ్యాయుడు చితకబాదిన ఘటన గురువారం వెలుగుచూసింది. ఈ సందర్భంగా ఎంఈఓ జయరాజు శుక్రవారం పాఠశాలలో విచారణ చేపట్టారు. ప్రిన్సిపాల్ పెన్నీలాతో మాట్లాడి వివరాలు సేకరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. విద్యార్థుల మానసిక స్థితిని అర్థం చేసుకుంటూ బోధించాలే తప్ప దండిచొద్దని, ఎవరైనా ఇలా చేస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

గుర్తుతెలియని వ్యక్తి మృతి



గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం

ఖమ్మంక్రైం: జిల్లా కేంద్రంలోని కాల్వొడ్డు సమీపాన గుర్తు తెలియని వ్యక్తి (35) మృతదేహాన్ని ఈనెల 3వ తేదీన గుర్తించారు. అన్నం ఫౌండేషన్ చైర్మన్ శ్రీనివాసరావు సహకారంతో మృతదేహాన్ని ప్రభుత్వ ఆస్పత్రి మార్చురీకి తరలించి భద్రపరిచారు. అయితే, ఇప్పటివరకు ఆయన సంబంధీకులు ఎవరూ రాకపోవడంతో శుక్రవారం కేసు నమోదు చేశామని ఖమ్మం త్రీటౌన్ పోలీసులు తెలిపారు. మృతుడి ఆచూకీ తెలిసిన వారు తమను సంప్రదించాలని సూచించారు.

ఇద్దరి ఆత్మహత్యాయత్నం

మహిళ మృతి, ఒకరి పరిస్థితి విషమం

తిరుమలాయపాలెం: కుటుంబాలకు దూరంగా ఉంటున్న మహిళ, ఓ వ్యక్తి నడుమ పరిచయం ఏర్పడగా.. ఏం జరిగిందో ఏమో కానీ నాలుగు రోజుల క్రితం పురుగుల మందు తాగి ఆత్మహత్యయత్నానికి పాల్పడ్డారు. వీరిలో మహిళ మృతి చెందగా, ఆమెతో సహజీవనం చేస్తున్నట్లుగా భావిస్తున్న వ్యక్తి పరిస్థితి విషమంగా ఉన్నట్లు సమాచారం. వివరాలు... మండలంలోని దమ్మాయిగూడెంకు చెందిన ఓ వివాహిత భర్తకు దూరంగా ఖమ్మంలో ఉంటుండగా, అక్కడ పిండిప్రోలు వాసితో పరిచయం ఏర్పడింది. వీరిద్దరికి ఇంతకు ముందే వేరే వ్యక్తులతో వివాహాలు జరిగి పిల్లలు కూడా ఉన్నారు. ఇద్దరి మధ్య ఏం జరిగిందో తెలియకపోగా,నాలుగు రోజులు క్రితం ఖమ్మంలో ఎలుకల మందు తాగారు. అనంతరం ఆస్పత్రిలో చేర్పించగా శుక్రవారం సదరు మహిళ మృతి చెందింది. ఆమెతో పాటు మందు తాగిన వ్యక్తి పరిస్థితి విషమంగా ఉన్నట్లు సమాచారం. కాగా, పోలీసులను వివరణ కోరగా మహిళ మరణాన్ని ధృవీకరించినా పూర్తి సమాచారం తెలియాల్సి ఉందన్నారు.

బడుగుల జీవితాల్లో వెలుగులు..

- బీఆర్‌ఎస్ నేతృత్వాన సంక్షేమం, అభివృద్ధి
- రాష్ట్ర రవాణా శాఖ మంత్రి అజయ్‌కుమార్



లబ్ధిదారులకు బీసీ బంధు చెక్కులు అందజేస్తున్న మంత్రి అజయ్‌కుమార్

ఖమ్మంమయూరిసెంటర్: రాష్ట్రంలోని బీఆర్‌ఎస్ ప్రభుత్వం బడుగు, బలహీన వర్గాల జీవితాల్లో వెలుగులు నింపుతోందని.. కులవృత్తులపై ఆధారపడి జీవనం సాగిస్తున్న వారి ఆర్థికాభివృద్ధికి చేయూతనందిస్తోందని రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్ వెల్లడించారు. ఖమ్మం భక్త రామదాసు కళాక్షేత్రంలో శుక్రవారం ఏర్పాటు చేసిన సమావేశంలో బీసీబంధు పథకం ద్వారా 300 మందికి రూ.3 కోట్ల విలువైన చెక్కులను మంత్రి పంపిణీ చేసి మాట్లాడారు. అంతరించిపోతున్న కులవృత్తులకు జీవం పోయాలనే ఉద్దేశంతో సీఎం కేసీఆర్ ప్రతీ కుటుంబానికి వంద శాతం సబ్సిడీతో రూ.లక్ష సాయం అందించాలని నిర్ణయించినట్లు తెలిపారు. బీసీ బంధు ద్వారా అందిస్తున్న ఆర్థిక సాయం ప్రతీ నెల సాగుతుందని, ఎవరూ ఆందోళన చెందాల్సిన అవసరం లేదని చెప్పారు. అలాగే, పోలియో హోంలో శ్రీమిత్ర ఫౌండేషన్, ఎస్‌ఆర్‌ఐల సహకారంతో సమకూర్చిన కుట్టుమిషన్లను మంత్రి అజయ్‌కుమార్ పేద మహిళలకు అందజేశారు. కుట్టు మిషన్లతో మహిళలు ఆర్థికంగా ఎదగాలని ఆకాంక్షించారు. ఆ తర్వాత నగరంలోని 36, 41వ డివిజన్లలో రూ.2.44 కోట్లతో చేపట్టిన అభివృద్ధి పనులకు మంత్రి శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేశారు. కాగా, 36వ డివిజన్‌కు వెళ్లిన మంత్రి పువ్వాడకు స్థానికులు, బీఆర్‌ఎస్ శ్రేణులు ఘన స్వాగతం పలికి భారీ ర్యాలీగా తీసుకెళ్లారు. కార్యక్రమాల్లో కేఎంసీ కమిషనర్ ఆదర్శ్ సురభి, మేయర్ పునుకొల్లు నీరజ, సుడా చైర్మన్ విజయ్‌కుమార్, కార్పొరేటర్లు కర్నాటి కృష్ణ, పసుమర్తి రామ్మోహన్, దండా జ్యోతిరెడ్డి, బీఆర్‌ఎస్ నగర అధ్యక్షుడు పగడాల నాగరాజు, వేములపల్లి వెంకటేశ్వరరావు, వర్తక సంఘం అధ్యక్షుడు చిన్ని కృష్ణారావుతో పాటు కొత్త వేంకటేశ్వరరావు, సున్నా మాధవరావు, కురువెళ్ల ప్రవీణ్, బయ్యన బాబు, బండి నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

రూ.కోట్ల నిధులతో వేగంగా అభివృద్ధి



పాండురంగాపురంలో అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేసిన మంత్రి

ఖమ్మంఅర్బన్/రఘునాథపాలెం: నగరంలోని ప్రతీ డివిజన్‌కు రూ.కోట్లలో నిధులు కేటాయిస్తూ అభివృద్ధి చేస్తున్నామని మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్ వెల్లడించారు. నగరంలోని 2, 3వ డివిజన్లలో పూర్తయిన అభివృద్ధి పనులను ప్రారంభించిన మంత్రి.. మరికొన్ని పనులకు శంకుస్థాపన చేశారు. మేయర్ నీరజ, సుడా చైర్మన్ బచ్చు విజయ్‌కుమార్, కమిషనర్ ఆదర్శ్ సురభి, కార్పొరేటర్ మలీదు వెంకటేశ్వర్లు, నాయకులు కొనకంచి ప్రసాద్, కాత్రాల శ్రీరాములు, పగడాల నాగరాజు, ఎల్లయ్య, ప్రసాద్, చిలువూరి కోటి, మాధవరావు పాల్గొన్నారు. అలాగే, రఘునాథపాలెం మండలం వీ.వీ.పాలెంలో రూ.87.59 లక్షలతో చేపట్టిన పనులకు మంత్రి శంకుస్థాపన చేశారు. అనంతరం ఏర్పాటుచేసిన సమావేశంలో పువ్వాడ మాట్లాడుతూ వచ్చే ఎన్నికల్లో ప్రజలు రాజకీయాలు చూడకుండా, కళ్ల ముందు జరిగిన అభివృద్ధిని చూసి తనను గెలిపించాలని కోరారు. మరోమారు తనను గెలిపిస్తే ఇంతకు నాలుగు రెట్ల అభివృద్ధి చేస్తానని తెలిపారు. తాను గెలిస్తే అర్హులందరికీ దళితబంధు, గృహలక్ష్మి వర్తించేలా కృషి చేస్తానన్నారు. ఎవరో వచ్చి మాయమాటలు చెబితే నమ్మి మోసపోవద్దని సూచించారు. డీసీసీబీ చైర్మన్ కూరాకుల నాగభూషణం, జెడ్పీటీసీ మాలోత్ ప్రియాంక, సర్పంచ్ మాధవితో పాటు గుత్తా రవి, రావెళ్ల శ్రీనివాసరావు, మద్దినేని వెంకటరమణ, కుతుంబాక నరేష్, జంగాల శ్రీను, దానయ్య, భూచక్రం, కీమా రామోజీ పాల్గొన్నారు.

ప్రపంచ వేదికలపై విద్యార్థులు రాణించాలి

టెన్నిస్, వాలీబాల్ కోర్టులు, ఓపెన్ జిమ్‌ను ప్రారంభించిన ఎమ్మెల్యే, కలెక్టర్



వైరా: వాలీబాల్ సర్వీస్ చేస్తున్న ఎమ్మెల్యే రాములునాయక్, పక్కన కలెక్టర్ గౌతమ్

వైరా: రాష్ట్ర విద్యార్థులు ప్రపంచ వేదికలపై రాణించేలా శిక్షణ పొందాలని వైరా ఎమ్మెల్యే లావుడ్యా రాములునాయక్ సూచించారు. వైరాలో లాన్‌టెన్నిస్, వాలీబాల్ కోర్టులు, ఓపెన్ జిమ్‌ను కలెక్టర్ వీపీ గౌతమ్‌తో కలిసి శుక్రవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ప్రభుత్వం కల్పిస్తున్న సౌకర్యాలను సద్వినియోగం చేసుకుంటూ విద్యార్థులు క్రీడల్లో రాణించాలని తెలిపారు. కలెక్టర్ గౌతమ్ మాట్లాడుతూ టెన్నిస్ ఆటను తన జీవితంలో మొదటగా ఐఏఎస్ అకాడమీలోనే చూశానని.. కానీ ఇప్పుడు ప్రభుత్వం అన్ని వసతులతో స్టేడియాలు నిర్మిస్తున్నందున సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. మున్సిపల్ చైర్మన్, వైస్‌చైర్మన్లు సూతకాని జైపాల్, ముళ్లపాటి సీతారాములు, ఎంపీపీ పావని, జెడ్పీటీసీ కనకదుర్గ, డీఎస్‌ఓ టి.సునీల్‌రెడ్డి, తహసీల్దార్ శ్రీనివాస్, కమిషనర్ పితాని వెంకటేశ్వర్లు, ఎంఈఓ కె.వెంకటేశ్వర్లుతో పాటు కట్టా కృష్ణార్జునరావు తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధిలో దూసుకెళ్తున్న తెలంగాణ

కొణిజర్ల: దేశంలోనే తెలంగాణ అన్నిరంగాల్లో అభివృద్ధి సాధిస్తోందని వైరా ఎమ్మెల్యే రాములునాయక్ అన్నారు. కొణిజర్ల మండలంలోని అమ్మపాలెంలో రూ.27 లక్షలతో నిర్మించనున్న సీసీ రోడ్లకు ఆయన శంకుస్థాపన చేసి మాట్లాడారు. సర్పంచ్ చిలుకూరి నాగేంద్రమ్మ, జెడ్పీటీసీ కవిత, ఎంపీడీఓ కె.మహాలక్ష్మి, ఎంపీఓ ప్రభాకర్‌రెడ్డితోపాటు అనూష, మాధవరావు, శ్రీనివాసరావు, వీరస్వామి, రవి, వెంకటలాలయ్య, తదితరులు పాల్గొన్నారు.

వంద రోజుల్లో హామీలు అమలుచేస్తాం..

పాదయాత్రలో కాంగ్రెస్ నేత సుధాకర్



తల్లాడ : బిల్లుపాడు క్రాస్ రోడ్డు వద్ద పాదయాత్రలో సుధాకర్, నాయకులు

తల్లాడ/కల్లూరు: కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన వంద రోజుల్లో ఆరు గ్యారంటీలను అమలు చేస్తామని ఆ పార్టీ నాయకుడు కొండూరి సుధాకర్ వెల్లడించారు. నియోజకవర్గంలో ఆయన చేపట్టిన పాదయాత్ర రెండో రోజైన శుక్రవారం తల్లాడ మీదుగా కల్లూరుకు చేరింది. ఈ సందర్భంగా సుధాకర్ మాట్లాడుతూ రాహుల్ గాంధీ ప్రకటించిన ఆరు గ్యారంటీ పథకాలను వంద రోజుల్లోనే అమలు చేసి తీరుతామన్నారు. తొమ్మిదేళ్ల బీఆర్‌ఎస్ పాలనలో ఏ ఒక్కరికి న్యాయం జరగలేదని ఆరోపించారు. సీఎం మాటల గారడీతో ప్రజలను మోసం చేస్తుండగా, మళ్లీ కొత్త హామీలతో మభ్యపెట్టేందుకు సిద్ధమయ్యారని పేర్కొన్నారు. సత్తుపల్లిలో అందరికీ దళిత బంధు వర్తింపజేస్తానని ఇటీవల ప్రకటించగా.. ఇది ఆచరణ సాధ్యం కాని విషయమని తెలిపారు. ఈ యాత్రలో డీసీసీబీ మాజీ చైర్మన్ మువ్వా విజయ్‌బాబు, నాయకులు గోపిశెట్టి వెంకటేశ్వరరావు, యర్రి నర్సింహారావు, తుమ్మలపల్లి రమేశ్, గొడుగునూరి లక్ష్మీరెడ్డి, నారపోగు వెంకటేశ్వరరావు, తూము వెంకటనారాయణ, పొట్టేటి బ్రహ్మారెడ్డి, ప్రసాదరెడ్డి, వజ్రాల నర్సిరెడ్డి, కాటేపల్లి కిరణ్‌కుమార్, యాసా వెంకటేశ్వరరావు, యంగళ సురేశ్, కీసర శ్రీనివాసరెడ్డి, అట్లూరి సత్యనారాయణరెడ్డి, మాగంటి శ్రీను, తుమ్మలపల్లి రమేశ్, పాత్రు శ్రీనివాసరావు, ధరావత్ మోహన్‌నాయక్, షేక్ మైబు, గూడూరు మాధవరెడ్డి, ముల్లంగి రమేశ్ తదితరులు పాల్గొన్నారు.

క్రీడలతో న్యాయవాదులకు ఆటవిడుపు

అంతర్ జిల్లాల క్రికెట్ పోటీలను ప్రారంభించిన జిల్లా జడ్జి



పోటీలను ప్రారంభిస్తున్న జిల్లా జడ్జి జగ్జీవన్‌కుమార్

ఖమ్మంలీగల్: నిత్యం ఒత్తిడి ఎదుర్కొనే న్యాయవాదులు క్రీడాపోటీల్లో పాల్గొనడం ద్వారా ఆటవిడుపుగా ఉంటుందని ఖమ్మం జిల్లా ప్రధాన న్యాయమూర్తి బీఎస్ జగ్జీవన్‌కుమార్ అన్నారు. తాళ్లూరి సాహస్ చౌదరి మెమోరియల్ ట్రస్ట్ ఆధ్వర్యాన ఏర్పాటుచేసిన రాష్ట్రస్థాయి న్యాయవాద క్రికెట్ పోటీలు శుక్రవారం ఖమ్మం సర్దార్ పటేల్ స్టేడియంలో మొదలయ్యాయి. ఈ పోటీలను ప్రారంభించిన న్యాయమూర్తి మాట్లాడారు. కాగా, టోర్నీకి 20 జట్లు హాజరుకాగా, బార్ కౌన్సిల్ సభ్యుడు కొల్లి సత్యనారాయణ, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు దిరిశాల కృష్ణారావు, టోర్నీ నిర్వాహకుడు తాళ్లూరి దిలీప్‌చౌదరితో పాటు మాదిరాజు లక్ష్మీనారాయణ, రావుల వెంకట్, పసుపులేటి శ్రీనివాస్, సింగం జనార్దన్, ఎక్కిరాల రాంబాబు, వెంకటగుప్తా, సుగుణారావు తదితరులు పాల్గొన్నారు. కాగా, తొలిరోజు నిర్వహించిన మ్యాచుల్లో మణుగూరు జట్టుపై ఖమ్మం వారియర్స్, కరీంనగర్ జట్టుపై రంగారెడ్డి జట్టు, కొత్తగూడెం జట్టుపై ఖమ్మం వారియర్స్, హనుమకొండ జట్టుపై కూకట్‌పల్లి జట్టు, నిజామాబాద్ జట్టుపై హైదరాబాద్ జట్టు, హుజూర్‌నగర్ జట్టుపై వరంగల్ జట్టు విజయం సాధించాయి.

టోర్నీ నిర్వహణ భేష్

న్యాయవాదుల కోసం రాష్ట్ర స్థాయి క్రికెట్ టోర్నీ నిర్వహించడం అభినందనీయమని రాష్ట్ర మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్ పేర్కొన్నారు. సర్దార్ పటేల్ స్టేడియంలో మొదలైన టోర్నీని శుక్రవారం సాయంత్రం పరిశీలించిన ఆయన మాట్లాడారు. జిల్లా కేంద్రంలోని సర్దార్ పటేల్ స్టేడియంలో క్రీడాకారుల కోసం అన్ని వసతులు సమకూర్చామని తెలిపారు. జడ్జి జగ్జీవన్‌కుమార్ మాట్లాడగా, టోర్నీ నిర్వాహకుడు తాళ్లూరి దిలీప్‌చౌదరి, దిరిశాల కృష్ణారావు కొల్లి సత్యనారాయణ, శ్రీనివాస్, రావుల వెంకట్ తదితరులు పాల్గొన్నారు.

దళితబంధు జాబితాలో అనర్హులు

రాష్ట్రీయ రహదారిపై దళితుల రాస్తారోకో



వైరా రూరల్ : పాలడుగులో రాస్తారోకోతో నిలిచిన వాహనాలు

వైరారూరల్: రాష్ట్ర ప్రభుత్వం దళితులు ఆర్థికాభివృద్ధికి ప్రవేశపెట్టిన దళితబంధు పథకాన్ని స్థానిక ప్రజాప్రతినిధులు అనర్హులకు కేటాయిస్తున్నారని మండలంలోని పాలడుగు దళితులు శుక్రవారం సీపీఎం నాయకులతో కలిసి ఆందోళనకు దిగారు. జగ్గయ్యపేట రాష్ట్రీయ రహదారిపై సుమారు రెండు గంటల పాటు రాస్తారోకో చేపట్టారు. తమ గ్రామంలో ఐదుగురికి పథకం మంజూరు కాగా, వారు ఆర్థికంగా నిలదొక్కుకున్న వారేనని తెలిపారు. కాగా, రాస్తారోకోతో వాహనాలు నిలిచిపోగా వైరా ఎస్‌ఐ మేడా ప్రసాద్ చేరుకుని ఫోన్‌లో ఉన్నతాధికారులతో మాట్లాడించగా వారు ఆందోళన విరమించారు. ఈ సందర్భంగా ధర్నా వద్ద ఆగిన డీసీసీ అధ్యక్షుడు పువ్వాళ్ల దుర్గాప్రసాద్ మాట్లాడుతూ దళితబంధు లబ్ధిదారుల ఎంపిక పారదర్శకంగా చేపట్టాలని డిమాండ్ చేశారు.

దళితబంధు రాలేదని దీక్ష



కారేపల్లి : దీక్ష చేపట్టిన రాధాగోవింద్

కారేపల్లి: అన్ని అర్హతలు ఉన్నా తనకు దళిత బంధు రాలేదంటూ కారేపల్లికి చెందిన ఆదెర్ల రాధాగోవింద్ తెలంగాణ తల్లి విగ్రహం వద్ద శుక్రవారం దీక్ష చేపట్టారు. దళితబంధు జాబితాలో పేరు చేర్చేందుకు కొందరు రూ.2 లక్షల నుంచి రూ.3 లక్షల వరకు వసూలు చేశారని, తాను డబ్బు ఇవ్వకపోవడంతో గుర్తించలేదని వాపోయారు. ఆయన దీక్షకు వివిధ పార్టీల నాయకులు వై.ప్రకాశ్, బోళ్ల రామస్వామి, కొమ్ము ఉపేందర్, గౌసుద్దీన్, ప్రసాద్ మద్దతు తెలిపారు.

కార్మిక హక్కులను కాలరాస్తున్న ప్రభుత్వాలు

- వచ్చే ఎన్నికల్లో సత్తా చాటాలి
- సీఐటీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పాలడుగు భాస్కర్



ఖమ్మంలో నిర్వహించిన ర్యాలీలో నాయకులు, స్కీం వర్కర్లు

ఖమ్మంమయూరిసెంటర్: కార్మికుల కష్టంతోనే నడుస్తున్న ప్రభుత్వాలు వారి సమస్యలను పరిష్కరించడంలో మాత్రం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తూ హక్కులను కాలరాస్తున్నాయని సీఐటీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పాలడుగు భాస్కర్ విమర్శించారు. కనీస వేతనం అమలు, సమస్యల పరిష్కారం, ఈఎస్‌ఐ, పీఎఫ్, రిటైర్మెంట్ బెనిఫిట్స్ కల్పించాలనే డిమాండ్‌తో ఆశా కార్యకర్తలు, అంగన్‌వాడీలు, మధ్యాహ్న భోజన కార్మికులు సీఐటీయూ ఆధ్వర్యాన శుక్రవారం ఖమ్మంలోని పెవిలియన్ మైదానం నుంచి సరితాక్లినిక్ సెంటర్ మీదుగా ఎస్‌ఎస్‌పీ క్యాంపులోని సుందరయ్య భవనం ఎదుట పార్క్ వరకు భారీ ర్యాలీ నిర్వహించారు. అనంతరం పార్క్‌లో ఏర్పాటుచేసిన సభలో భాస్కర్ మాట్లాడుతూ సమస్యలు పరిష్కరించకపోగా సమ్మెలు చేయొద్దని ప్రభుత్వాలు హుకుం జారీ చేస్తుండటం గర్హనీయమని పేర్కొన్నారు. కార్మికుల రెక్కల కష్టంతో కొనసాగుతున్న పాలకులు ఇకనైనా వారికి కనీస వేతనం రూ.26 వేలు చెల్లించాలని డిమాండ్ చేశారు. కాగా, కార్మికుల హక్కులను కాలరాసేలా వ్యవహరిస్తున్న మోదీ, కేసీఆర్‌కు రానున్న ఎన్నికల్లో గుణపాఠం చెప్పాలని పిలుపునిచ్చారు. సభలో సీపీఎం జిల్లా కార్యదర్శి నున్నా నాగేశ్వరరావు, సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు తుమ్మ విష్ణు, రాష్ట్ర కార్యదర్శి వెంకటేశ్, జిల్లా కార్యదర్శి కల్యాణం వెంకటేశ్వర్లు, నాయకులు ఎర్రా శ్రీకాంత్, వై.విక్రమ్, రమ్య, నాయకులు నర్సింహారావు, మంగమ్మ, జిల్లా ఉపేందర్, బందారు యాకయ్య తదితరులు పాల్గొన్నారు.

విధులు బహిష్కరించిన ఆరోగ్యశ్రీ ఉద్యోగులు

ఖమ్మంవైద్యవిభాగం: సమస్యలు పరిష్కరించాలనే డిమాండ్‌తో ఆరోగ్యశ్రీ హెల్త్ కేర్ ట్రస్ట్‌లో పనిచేస్తున్న ఆరోగ్యమిత్రలు, టీంలీడర్లు శుక్రవారం విధులు బహిష్కరించారు. ఈ నెల 8వతేదీ వరకు చేపట్టనున్న ఆందోళనల్లో భాగంగా వారు విధులు బహిష్కరించగా ఉమ్మడి జిల్లాలోని 20నెట్‌వర్క్ ఆస్పత్రులు, 14ప్రభుత్వ ఆస్పత్రుల్లో సేవలు నిలిచిపోయి రోగులు ఇబ్బంది పడ్డారు. కేడర్ మార్పు, వేతనాల పెంపు, హెల్త్ కార్డులు జారీతో పాటు ట్రస్ట్ ఉద్యోగులుగా గుర్తించాలనే తదితర డిమాండ్లతో వారు ఆందోళన బాట పట్టారు. ఉమ్మడిజిల్లాలోని 80మంది ఉద్యోగులు విధులు బహిష్కరించగా, ఖమ్మంలో ఆందోళన నిర్వహించారు.

వాసవీక్లబ్ ఉమ్మడి జిల్లా గవర్నర్‌గా శ్రీనివాస్



శ్రీనివాస్‌కు నియామకపత్రం అందజేస్తున్న దృశ్యం

ఖమ్మంరాపర్తినగర్: ఇటీవల జరిగిన వాసవీక్లబ్ ఎన్నికల్లో ఖమ్మంకు చెందిన గుమ్మడవెల్లి శ్రీనివాస్ ఉమ్మడి జిల్లా గవర్నర్‌గా ఎన్నికయ్యారని ఎన్నికల అధికారి ఎర్రం సుజాత తెలిపారు. గతంలో ఆయన డిస్ట్రిక్ట్ వైస్ గవర్నర్‌గా పనిచేశారు. ఇప్పుడు గవర్నర్‌గా ఎన్నికైన శ్రీనివాస్‌ను వాసవీక్లబ్, ఆర్యవైశ్య సంఘం బాధ్యులు దోసపాటి వెంకటేశ్వరరావు, రాచర్ల వెంకటేశ్వర్లు, దారా మల్లికార్జునరావు, దారా నర్సింహారావు, గోళ్ల రాధాకృష్ణమూర్తి, మాశెట్టి వరప్రసాద్, గుంటుపల్లి దివాకర్‌గుప్తా, మహంకాళి మల్లేశ్వర్, కొత్తూరు కిశోర్ ఓం, గుమ్మడవెల్లి శేఖర్ తదితరులు శుక్రవారం సన్మానించారు.

ఇద్దరు అధ్యాపకులకు ప్రిన్సిపాళ్లుగా పదోన్నతి

ఖమ్మంసహకారనగర్: ఖమ్మంలోని ఎస్‌ఆర్ అండ్ బీజీఎన్‌ఆర్ డిగ్రీ కళాశాల అధ్యాపకులు ఇద్దరికి పదోన్నతి లభించింది. ఈ సందర్భంగా కళాశాల విద్యా కమిషనర్ గురువారం రాత్రి ఉత్తర్వులు జారీ చేశారు. కళాశాల హిస్టరీ అధ్యాపకుడు డాక్టర్ కె.జాన్‌మిల్టన్‌కు భద్రాచలం ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్‌గా పదోన్నతి కల్పించగా.. రసాయనశాస్త్రం అధ్యాపకుడు డాక్టర్ పి.రమేశ్ సంగారెడ్డి జిల్లా జోగిపేట ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్‌గా పదోన్నతి లభించింది. ఈ సందర్భంగా ప్రిన్సిపాళ్లుగా పదోన్నతి పొందిన ఇద్దరు సీనియర్ అధ్యాపకులను కళాశాల ప్రిన్సిపాల్ మహ్మద్ జకీరుల్లా, వైస్ ప్రిన్సిపాళ్లు బి.వెంకటేశ్వరరెడ్డి, టి.జీవన్‌కుమార్, అధ్యాపకులు, లెక్చరర్ల సంఘం బాధ్యులు ఎన్.గోపి, రవికుమార్, మాధవరావు, కిరణ్‌కుమార్, విజయకుమార్, జర్పుల రమేశ్, బి.వెంకన్న తదితరులు అభినందించారు.

తనిఖీల్లో గంజాయి స్వాధీనం



నిందితులు, గంజాయిని చూపుతున్న ఎక్సైజ్ పోలీసులు

ఖమ్మంక్రైం: జిల్లా కేంద్రంలోని కోదాడ క్రాస్ వద్ద శుక్రవారం ఖమ్మం–2 ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్ ఆర్.రాజిరెడ్డి ఆధ్వర్యాన తనిఖీలు చేపట్టారు. ఈ సందర్భంగా ద్విచక్ర వాహనంపై వెళ్తున్న ఖమ్మం రూరల్ మండలం మద్దులపల్లికి చెందిన తుంగ విజయ్‌కుమార్, ఖమ్మం రాతి దర్వాజాకు చెందిన కొల్లి నరేందర్, భూక్యా కల్యాణ్‌ను తనిఖీ చేయగా రూ.25 వేల విలువైన కేజీ గంజాయి లభ్యమైంది. దీంతో వారిని అరెస్ట్ చేసి ద్విచక్ర వాహనాన్ని సీజ్ చేశారు. కాగా, విజయ్‌కుమార్ ఇతర ప్రాంతాల నుంచి గంజాయి తీసుకొచ్చి చిన్న ప్యాకెట్లుగా మార్చి అమ్ముతున్నట్లు గుర్తించారు. తనిఖీల్లో ఎస్‌ఐ ఎం.సరిత, ఉద్యోగులు నరేందర్, మౌలంకార్, సురేందర్, నర్సింహారావు, వీరభద్రం, గురుప్రసాద్, రాధ పాల్గొన్నారు.

నల్లబెల్లం, పటిక పట్టివేత

నేలకొండపల్లి: అక్రమంగా లారీలో తరలిస్తున్న నల్లబెల్లం, పటికను నేలకొండపల్లి పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. పోలీసులు శుక్రవారం మండలంలోని కొత్తకొత్తూరు వద్ద వాహన తనిఖీలు చేస్తుండగా ఓ లారీలో ఉన్న వారు అనుమానాస్పదంగా కనిపించారు. దీంతో పరిశీలించగా గుడుంబా తయారీకి వినియోగించే రూ.1.52 లక్షల విలువైన 15 క్వింటాళ్ల నల్లబెల్లం, 15 కేజీల పటిక లభించడంతో స్వాధీనం చేసుకుని డ్రైవర్ కొర్ల రాంబాబును అదుపులోకి తీసుకున్నట్లు ఎస్‌ఐ సతీశ్ తెలిపారు.

బంగారు గొలుసు అపహరణ

సత్తుపల్లి: మహిళ మెడలో బంగారు గొలుసు అపహరణకు గురైన ఘటనపై కేసు నమోదైంది. సత్తుపల్లిలోని బొంతు ఆశ్లేష వీధిలో నివాసముంటున్న బి.విజయలక్ష్మి ఇంట్లో ఫోన్ మాట్లాడుతుండగా 4వ తేదీన గుర్తుతెలియని వ్యక్తి చొరబడి ఆమె మెడలోని రూ.80వేల విలువైన 30 గ్రాముల బంగారు గొలుసు లాక్కెళ్లాడు. ఘటనపై బాధితురాలు శుక్రవారం చేసిన ఫిర్యాదుతో పోలీసులు కేసు నమోదు చేశారు.

ఖాతాలో రూ.45 వేలు స్వాహా

సత్తుపల్లి మండలం బుగ్గపాడుకు చెందిన ఎం.కృష్ణ ఫోన్‌కు గత జూలైలో వచ్చిన మెసేజ్‌లను ఓపెన్ చేయగా సైబర్ నేరగాళ్లు ఆయన ఖాతాలోని రూ.45 వేలు స్వాహా చేశారు. ఈమేరకు బాధితులు చేసిన ఫిర్యాదుతో శుక్రవారం కేసు నమోదు చేసినట్లు సత్తుపల్లి పోలీసులు తెలిపారు.